క్లుప్తంగా

కరుణించమ్మా..కిల్లమ్మ..



కిల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

మందస: కిల్లమ్మతల్లి.. ఎంతో పవిత్రత గల దైవం. మంజూష(మందస) సంస్థానాన్ని రాజుల పరిపాలనలో మందస కేంద్రంగా ఏడు గురు అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. వీరంతా అక్కా, చెల్లెల్లుగా పూర్వీకులు చెబుతారు. మందస మండలంలోని పిడిమందసలో కిల్లమ్మతల్లి ఆలయం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వెళ్లిన ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. మాజీ సర్పంచ్ బాలక విజయశ్రీ, యువజన నాయకుడు గుంపు జగదీష్ పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం బలోపేతానికి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ రాంజీ

ఇచ్ఛాపురం రూరల్: నియోజకవర్గ స్థాయిలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ చాత్తాద శ్రీవైష్ణవ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కె.హరి నారాయణ (రాంజీ) అన్నారు. ఆదివారం టి.బరంపురంలో జరిగిన 21 ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమయంలోనైనా చాత్తాద శ్రీవైష్ణవ కుటుంబాలకు రాష్ట్ర సంఘం అండగా ఉంటుందని, అటు ఆర్థికంగా ఇటు రాజకీయంగా ప్రతి ఒక్కరూ రాణించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్.పి. పెద్దబాబు, సంఘ కార్యవర్గ సభ్యులు ఎస్.పి. శ్యామ్, శ్రీరంగం వరప్రసాద్, శ్రీనివాసరావు, శివకృష్ణ, కన్వీనర్లు ఉదయ్, అనంతస్వామి, చిరంజీవి, గణపతి, బాబి, చలపతి, ఉమాపతి, కూర్మారావు, జయమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయం అందిస్తున్న స్నేహితులు

ఇచ్ఛాపురం: పక్షవాతంతో బాధపడుతున్న సుమిత్ర నందా అనే మహిళకు ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాల 2000 బ్యాచ్ టెన్త్ ఒడియా పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆదివారం రూ.67500 నగదును వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు అభినందించారు.

కంద్ర వీధిలో కార్డెన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధిలోని కంద్రవీధిలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి సీఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో వీధుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం, సారా, గంజాయి వంటి నిషేధిత పదార్థాలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలించి సరైన రికార్డులు లేని సుమారు 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవ రికార్డులు లేని వాహనాలు అధికంగా తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లవచ్చన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యువకుడు అదృశ్యం



సవర వినోద్

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ బాలాజూరు గిరిజన గ్రామానికి చెందిన సవర వినోద్(30) కనిపించడం లేదని తల్లిదండ్రులు సవర లచ్చయ్య, కుమారి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్చి 13 నుంచి అదృశ్యమయ్యాడని, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే కాశీబుగ్గ ఎస్‌ఐ 6309990857, సీఐ 6309990825 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

జనరంజక పాలనకే ఓటేద్దాం



ఇచ్ఛాపురం రూరల్: డొంకూరులో పిరియా విజయ ప్రచార రథాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న మహిళ

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, మళ్లీ జనరంజన పాలనకే ఓటేద్దామని నాయకులు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల పరిధిలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా పిరియా విజయ, పలాస ఎమ్మెల్యేగా సీదిరి అప్పలరాజు, టెక్కలి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సోంపేట: మాకన్నపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారంనిర్వహిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీపీ నిమ్మన దాస్



మందస: ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్:మెట్టూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



కాశీబుగ్గ: తాళ్లభద్రలో ప్రచారం నిర్వహిస్తున్న రాపాక చిన్నారావు



ఇచ్ఛాపురం: 5, 6వ వార్డుల్లో కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



వజ్రపుకొత్తూరు: మహదేవిపురంలో ప్రచారం నిర్వహిస్తున్న వెంకటరావుదొర, పార్టీ నేతలు



ఇచ్ఛాపురం: 8వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



పలాస: బ్రాహ్మణతర్లాలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకులూరులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు, మద్దతు తెలుపుతున్న మహిళలు



వజ్రపుకొత్తూరు: దేవునల్తాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఉదయ్‌కుమార్, పార్టీ నేతలు



నందిగాం: సవరబడగాంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఫాల్గుణరావు, జద్యాడ జయరాం తదితరులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని 7వ వార్డు చినబాడాం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్‌లో ఆదివారం ఈస్టర్ సండే ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ క్రీస్తు సందేశం వినిపించారు.

సోంపేట: బారువ ఫెయిత్‌హోం చర్చి ఆధ్వర్యంలో బారువ తీర ప్రాంతలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఎ.జాన్ ఆధ్వర్యంలో 50 రోజుల ఉపావాస ప్రార్థన ముగించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని గొల్లవీధి ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి ఆవరణలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ప్రత్తి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, ఎంపీ ఎస్ మూర్తి, పి.గోపాల్, వి.వెంకటేష్, సీహెచ్ లక్ష్మణ్‌రావు, సీహెచ్ జోష్‌కుమార్, పి.వీర్రాజు, కె.శివరావు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: చినబాడాం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్‌లో క్రైస్తవులు



ఇచ్ఛాపురం: ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో క్రీస్తు బోధనలు వివరిస్తున్న పాస్టర్ ప్రవీణ్‌కుమార్



సోంపేట: బారువ తీరంలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్ జాన్

వైఎస్సార్ సీపీలో హరిపురం యువత చేరిక



మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీ లో చేరిన హరిపురం యువకులు

మందస/కాశీబుగ్గ: మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గౌతు కుటుంబ పాలనలో అభివృద్ధి నోచుకోలేని పరిస్థితులు ఏర్పడడం, ఐదేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు వారంతా ప్రకటించారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు వలస రాజకీయాలు చేస్తున్నారని, వ్యాపార, వ్యక్తిగత అవసరాలకై రాజకీయాలు చేస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలకు అవకాశం ఇచ్చి భంగపడవద్దని యువకులు కోరారు. వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు.

పార్టీలో చేరిన వారిలో వంశీ, జన్నీ, దుర్గ, మహేశ్, తమ్మిరెడ్డి శేఖర్, గోకర్ల దుర్యోధన, రంజిత్, అజయ్, రాజు, బన్నీ, ప్రశాంత్, దీపక్, కన్నబాబు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ప్రదీప్ కుమార్, నాని, బత్తిని చిరంజీవి, రాజేశ్, జీవన్, ఉమాశంకర్, రాజేశ్; సాయి, కవి, కాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీవి దిగజారుడు రాజకీయాలు



రెయ్యిపాడు 7వ వార్డు సభ్యుడు వానపల్లి గోపాల్

వజ్రపుకొత్తూరు: ఇష్టంలేని వారికి, బలవంతంగా కండువాలు వేసి పార్టీలో చేరినట్లు పత్రికలకు చెప్పడం తెలుగుదేశం పార్టీవి దిగజారుడుతనానికి నిదర్శనమని రెయ్యిపాడు 7వ వార్డు సభ్యుడు వానపల్లి గోపాల్ అన్నారు. తన ప్రయాణం వైఎస్సార్‌సీపీతోనే ఉంటుందని స్పష్టం చేశారు. రెయ్యిపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అంటే నాకు ఎంతో ఇష్టమని, తాను వైఎస్సార్‌సీపీతోనే ఉన్నానని స్పష్టం చేశారు. పూండిలో బజారుకు వెళ్లగా తమ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పలాసలో పని ఉందని చెప్పి తీసుకెళ్లారని, అక్కడ గౌతు శిరీష సమక్షంలో కండువాలు వేశారని చెప్పారు. తాను వార్డు మెంబర్ మాత్రమేనని, వారి పత్రికల్లో మాత్రం సర్పంచ్, ఉప సర్పంచ్ అంటూ సిగ్గుమాలినప్రకటలు ఇవ్వడం బాధాకరమన్నారు. స్థానిక సర్పంచ్ బత్సల ధర్మారావు, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల హరిని రాయణ మాట్లాడుతూ పలాసలో తెలుగుదేశం గ్రాఫ్ పడిపోయిందని, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తాను వార్డు మెంబర్ మాత్రమేనని , పత్రికలకు మాత్రం సర్పంచ్, ఉప సర్పంచ్ అంటూ మతిలేని, సిగ్గుమాలిన తప్పుడు ప్రకటలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బత్సల ధర్మారవు, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల హరినిరాయణ మాట్లాడారు.

ఒడియా కళాకారులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

కంచిలి: ఆంధ్రప్రదేశ్‌లో నివాసముంటున్న ఒడియా కళాకారులకు గృహాలు, పింఛన్లు, మృదంగం, కంజర, డోలక్, హార్మోనియం తదితర కళా పరికరాలు అందించి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి నివేదించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం కంచిలి మండలం కుంబరినౌగాం పంచాయతీ లక్ష్మీపురంలో బిమ్మేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఒడియా కళాకారులు మహాసంఘం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఆంధ్రాలో నివాసముంటున్న 46 మంది ఒడియా కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఖగేశ్వర గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి సాహు, కార్యదర్శి సురేష్‌కుమార్ పాణిగ్రాహి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్, సుభాష్ రోషన్ సాహు, నల్ల నీలకంఠం, జలంధర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశాల గడువు పెంపు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఏప్రిల్ 6 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9666370810, 9491804092 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సేవలతోనే గుర్తింపు



పాపారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో అందించిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ముంజేటి పాపారావు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం అదే పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, మెడికల్ సిబ్బంది, బంధుమిత్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల సమక్షంలో ప్రిన్సిపాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పెన్షనర్లకు ద్రోహం చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

ఇచ్ఛాపురం : వృద్ధులతో పాటు అవ్వాతాతలు, దివ్యాంగుల చెంతకు వలంటీర్లు వచ్చి పెన్షన్లు అందజేయకుండా అడ్డుపడి చంద్రబాబునాయుడు తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ధ్వజమెత్తారు. ఇచ్ఛాపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నాడని దుయ్యబట్టారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎలక్షన్ కమిషన్‌కి లేఖ రాయించి వలంటీర్ల సేవలను నిలిపి వేశారని ఆరోపించారు. ప్రజలకు మేలు జరిగే ఏ కార్యక్రమమైన అడ్డుకోవడమే టీడీపీ నేతల లక్ష్యమని మండిపడ్డారు. సీఎం జగన్‌పై కక్షసాధింపు చర్యలతో పేదలకు ఇబ్బంది పెట్టేలా చంద్రబాబు వ్యవహరించడం దారుణమన్నారు. వలంటీర్ల సేవలు లేకపోవడంతో మళ్లీ మండుటెండల్లో పెన్షన్ లబ్ధిదారులకు పడిగాపులు తప్పవన్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లీ, కౌన్సిలర్లు పి.మధుమూర్తి, బి.జగన్, నాయకులు పిలక సంతు, పరపటి కోటి, కాళ్ల సత్యం, నీలాపు ఢిల్లీ, ఈశ్వర్‌రెడ్డి, రామ్మూర్తి, పీతాంబర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

టెక్కలి: ఓటు వజ్రాయుధం వంటిదని, అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. స్థానిక చిన్నచేరీవీధి, పెద్ద చేరీవీధి, గొల్లవీధి, భూలోకమాతవీధి, కంద్రవీధి, శ్రీనివాసనగర్, ఎన్‌టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టెక్కలిలో ఎన్నికల ప్రచారం

టెక్కలి: టెక్కలిలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ తదితరులు మధ్యాహ్నం 2:30 గంటలకు చేరీవీధిలోని కిల్లి పోలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అంబేడ్కర్ జంక్షన్ మీదుగా ఇందిరాగాంధీ జంక్షన్ వరకు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో అన్ని విభాగాల నాయకులు హాజరు కావాలని కోరారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

టెక్కలి: నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో టెక్కలికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక ఆదర్శ కోచింగ్ సెంటర్‌కు చెందిన చమళ్ల దుర్గాదీక్షిత్, బెలమర అవినాష్, వై.సంజయ్‌కుమార్, కె.ధ్రువన్ చాతుర్య తదితరులు నవోదయకు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

కంచిలి : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో కంచిలి ప్రాథమిక పాఠశాలకు చెందిన కంబాల మహిత్‌రెడ్డి, నర్తు రామ్, ఇంటివెనుక కౌశిక్, విజ్ఞాన్ స్కూల్‌కు చెందిన కాలవ జ్యోష్ణ, ఎక్కల ప్రాథమిక పాఠశాల నుంచి జీరు లోహిత్‌లు ఎంపికయ్యారు. వీరిని కంచిలి హెచ్‌ఎం రెల్ల కామరాజు, విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమా, కరస్పాండెంట్ ఆదినారాయణ, ఎక్కల పాఠశాల హెచ్‌ఎం గిరిబాబు అభినందించారు.

సోంపేట: పట్టణంలోని టీడీఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థి పి.మహేష్ నవోదయ సీటుకు ఎంపికైనట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: పలు మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పలాసలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, రూ.1000 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.